క్లుప్తంగా

మూడు ఇసుక లారీలు పట్టివేత

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద శనివారం ఉదయం నకిలీ బిల్లులతో విశాఖపట్నం అక్రమంగా రవాణా అవుతున్న మూడు ఇసుక లారీలను గనుల శాఖ విజిలెన్స్ ఏడీ బి.అశోక్ కుమార్ పట్టుకున్నారు. లారీలను సీజ్ చేసి పైడిభీమవరం సిస్కో పోలీస్ స్టేషన్ వద్ద ఉంచారు.

కోటేశ్వరరావుకు డాక్టరేట్



పట్టా అందుకుంటున్న కోటేశ్వరరావు

జి.సిగడాం: మండలంలోని నాగులవలస పాఠశాల తెలుగు పండిట్ పందిరి కోటేశ్వరరావు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కళింగాంధ్ర కథ(2001–2010) పరిశీలన అనే అంశంపై వివిధ రచయితలు రాసిన దశాబ్దం కథలపై పరిశోధన పత్రం రూపొందించి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమర్పించడంతో డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు శనివారం ఉపాధ్యాయులుయ, గ్రామస్తులు అభినందించారు.

భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యం



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ సాయిప్రత్యూష

జి.సిగడాం: రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించి రైతులను అన్ని విధాలా ఆదుకోవడమే లక్ష్యమని శ్రీకాకుళం ఆర్‌డీఓ సాయి ప్రత్యూష అన్నారు. శనివారం జి.సిగడాం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల రీ సర్వేలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడుతున్నాయని చెప్పారు. సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్లు ఎన్.నిర్మల, కె.గాయత్రి, ఆర్‌ఐ ఎ.రాధ, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ ప్రతిష్ఠాపనోత్సవం



స్వామివారిని దర్శించుకున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: రణస్థలం పంచాయతీ చినలంకపేటలో సీతారాముల ఆలయ ప్రతిష్ఠాపనోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, నాయకులు మజ్జి రమేష్, కరిమజ్జి భాస్కరరావు, మహంతి జోగినాయుడు, ఎంపీటీసీ కరిమజ్జి రమణ, సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలగ బీసీ రిజర్వేషన్ సాధనకు ఐక్య పోరాటాలు



మాట్లాడుతున్న వెంకటరమణారావు

జి.సిగడాం: ఉత్తరాంధ్రలో తెలగ కులస్తులకు బీసీ రిజర్వేషన్ చేసేందుకు ఐక్య పోరాటాలు చేయాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం నాయకులు పల్లంటి వెంకటరమణారావు(పీవీఆర్) పిలుపునిచ్చారు. శనివారం వీఆర్‌పేట, నాగులవలస గ్రామాల్లోని తెలగ కులస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో తెలగ కులస్తులకు చేయూత ఇచ్చేందుకు చర్యలు చేపట్టారని, ఆయన మరణానంతరం వచ్చిన పాలకులు పట్టించుకోలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలగ కులస్తులను బీసీల్లో చేర్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, సర్పంచులు, బత్తుల వెంకటకృష్ణారావు, ధారబోయిన ధర్మారాజ్, పలిశెట్టి సూర్యనారాయణ, బత్తుల సన్యాసిరావు, మానం సత్యారావు, చందనాల రంగారావు, గర్లంకి శ్రీనివాసరావు, బాలబొమ్మ చిన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు ఫలించేనా?

- ధాన్యం విక్రయాలకు రైతుల పాట్లు
- సేకరణ ఆపేసిన మిల్లర్లు
- లెవీ లక్ష్యం పెంపునకు అధికారుల ప్రతిపాదనలు
- ప్రభుత్వం నుంచి రాని అనుమతులు



వమరవల్లి ప్రాంతంలో పొలంలో ఉన్న వరి కుప్పలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

గార : ధాన్యం విక్రయాలకు సంబంధించి అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. గార మండలంలో ఖరీఫ్ సీజన్ పండిన ధాన్యం మరో పది వేల టన్నుల నిల్వలు ఇంకా రైతుల వద్దే ఉన్నాయి. వీటిని వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నా పాలకులు సరిగ్గా స్పందించడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళింగపట్నం, వమరవిల్లి, శాలిహుండం, శ్రీకూర్మం, కొర్లాం, కొర్ని, అంపోలు, వాడాడ, గొంటి తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ప్రభుత్వం నుంచి కొనుగోలుకు అనుమతి లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. గత డిసెంబర్‌లో ఏకధాటిగా పదిరోజుల పాటు వర్షాలు కురవడం, సన్న రకాలు తడిచిపోవడంతో చాలా మంది రైతులు వచ్చినంత ధర చాలన్న రీతిగా హడావుడిగా అమ్మకాలు చేసేశారు. కొందరు రైతులు తెలిసిన మిల్లర్ వద్దకు పంపించారు. ఇప్పుడు లక్ష్యం అయిపోయిందంటూ చెబుతుండటంతో చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. సన్న రకాలుకు ఎలాగూ ప్రైవేటులో ధరలేకపోయినా, దొడ్డు రకాలు కూడా కొనుగోలు చేయని పరిస్థితి దాపురించింది.

అరకొరగా ఇస్తే ఇబ్బందులే..

రైతుల నుంచి వస్తున్న ఒత్తిడితో ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి కనీసం 10 వేల టన్నుల లక్ష్యమివ్వాలని అడుగుతున్నారు. ఇదిలా ఉండగా 4,500 మెట్రిక్ టన్నుల లక్ష్యమివ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. కానీ అదనంగా 2వేల టన్నులకే అవకాశమిచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం. వాస్తవంగా గతేడాది 22,945 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగ్గా, ఈ ఏడాది ఇప్పటికే 21 వేల మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తయ్యింది. కేవలం రెండు వేల టన్నుల మాత్రమే అవకాశమివ్వనున్నట్లు తెలుస్తోంది. గతేడాది బీపీటీ (సాంబమసూరు,1241 సన్న రకం)కు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో నేరుగా కళ్లాలు వద్దకు వ్యాపారులు వచ్చి అధిక ధరలకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేదు. ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో ధరలు లేకపోవడం, రబీ పంట సాగు, సంక్రాంతి వంటి పర్వదినాలు రావడంతో రైతన్నలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పుడు కూడా సన్న, దొడ్డు రకాలకు కేవలం పదుల రుపాయల్లోనే తేడా ఉంది. కొద్ది రోజులైతే దొడ్డు రకాలకే డిమాండ్ ఉన్న పరిస్థితి. చాలా మంది రైతులు ఇంకా నూర్పు చేయని పరిస్థితులుండగా, మరి కొంతమంది రైతులవి ధాన్యం కల్లాల్లోనే పేరుకుపోయాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆందోళన వద్దు..

ఈ విషయమై మండల వ్యవసాయాధికారి జె.శ్రీదీప్తి వద్ద ప్రస్తావించగా లక్ష్యం పెంచాలని సివిల్ సప్లయ్స్‌కు నివేదించామని చెప్పారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామని, ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం ఉత్తర్వులు వెల్లడించే అవకాశం ఉందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

కొనుగోలు పెంచాలి



మిల్లర్లు ధాన్యం సేకరణ ఆపేశారు. ఇప్పటికే 10 వేల టన్నుల వరకు రైతుల వద్ద పలు రకాలైన రకాలున్నాయి. ఈ ఏడాది డిసెంబరు, జనవరిలో కురిసిన వర్షాలు, మంచు ప్రభావం, వేరే పంటలపై రైతాంగం ఉండిపోవడంతో పొలాల్లోనూ, కల్లాల్లోనే ధాన్యం నిల్వలు ఉండిపోయాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– పీస శ్రీహరిరావు,కొర్లాం సర్పంచ్, గార వైఎస్సార్ సీపీ వ్యవసాయ విభాగం అధ్యక్షుడు

పొలాల్లోనే వరి కుప్పలు..



పొలాల్లోనే ఇప్పటికీ రైతులు పెట్టుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ప్రైవేటులో సాంబమసూరి, చిన్న రకాలకు డిమాండ్ లేదు. చాలా ఇబ్బందులు పడి ఎలాగోలా ఇంటి వద్దనే స్టాకు వేసుకున్నాను. ప్రభుత్వం స్పందించి సన్న రకాలకు ధర పెరిగేలా చూడాలి

– ఎస్.అప్పారావు, రైతు, వమరవిల్లి

దృష్టి సారించాలి..



ఈ ఏడాది ధాన్యం సేకరణ లక్ష్యం అయిపోయిందని మిల్లర్లు అంటున్నారు. వరికుప్పలు ఆడించగా వచ్చిన ధాన్యాన్ని కల్లాల్లోనే నిల్వ చేసుకుంటున్నాం. అధికారులు దృష్టి సారించి ధాన్యం కొనుగోలు చేయాలి. ఈ ఏడాది అపరాలు పంటకూడా దెబ్బతింది. ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలి.

– రువ్వు అప్పారావు, రైతు, అంపోలు

జల్లపేటలో తాగునీటికి కటకట



జల్లపేటలో మొరాయించిన పంపుసెట్టు ఇదే

గార: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని జల్లపేటతో పాటు మరో ఐదు గ్రామాలకు శాలిహుండం రక్షిత నీటి పథకం ద్వారా నెల రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. అక్కడ నీటి సేకరణ లభ్యత తగ్గిపోవడంతో జల్లపేటలోని పంచాయతీ పంపు సెట్ ద్వారా తాగునీరు పంపిణీ చేస్తున్నారు. అయితే అక్కడి పంపు సెట్ మోటారు కూడా కాలిపోవడంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం 8 గంటల తర్వాత రైతుల పంపుసెట్లకు త్రీఫేజ్ విద్యుత్ పంపిణీ జరుగుతోంది. దీంతో అక్కడికి వెళ్లి నీరు పట్టుకోవాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జల్లపేటతో పాటు మంగువారిపేట, కోనప్పగారిపేట, ముద్దాడపేట, గాబువానిపేటలో నెల రోజులుగా ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఆర్‌డబ్ల్యూస్ అధికారులకు సమస్యను తెలియజేస్తే పంచాయితీ సిబ్బందే స్థానికంగానే పరిష్కరించుకోవాలని తప్పించుకుంటున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య తీర్చాలని మహిళలు కోరుతున్నారు.

ఎస్పీని కలిసిన తూర్పు కాపు సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్

శ్రీకాకుళం క్రైమ్: రాష్ట్ర తూర్పు కాపు సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మక్కా సాయిబాబునాయుడు శనివారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పుకాపుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



హోమం చేస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలం నాగులవలసలో రామాలయం ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా శనివారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

యథేచ్ఛగా అనధికార మద్యం విక్రయాలు

గార: చిన్న వత్సవలస రాజరాజేశ్వరి (రాజులమ్మ) తల్లి సంబరాలు రెండో వారానికి చేరుకున్న నేపథ్యంలో సమీప గ్రామాల్లో ఇష్టానుసారంగా మద్యం చిల్లర దుకాణాలు ఏర్పడ్డాయి. అదే గ్రామంలో ఒక గదిని తీసుకొని స్టాకు ఉంచినట్టు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఉత్తరాంధ్ర నుంచి అనేక కుటుంబాలు శనివారం రాత్రికే చినవత్సవలస సమీపంలో విడిదులు ఏర్పాటు చేసుకున్నాయి. రాత్రంతా ఆరుబయటే ఉండి ఆదివారం ఉదయం సమీప సముద్రానికి వెళ్లి స్నానాలు చేసి పూజల్లో పాల్గొంటారు. ఇదే అదనుగా పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు తెచ్చి అధిక ధరలకు అమ్మేస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

శ్రీనివాసా గోవిందా..!



నారాయణ తిరుమలలో వెంకన్న స్వామికి పూజలు



మొండేటివీధిలో వేంకటేశ్వరస్వామి



దూదివారి కోవెలలో తులసిమాల అలంకరణలో వెంకన్న



షిరిడీసాయి మందిరం వద్ద వేంకటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుజరాతిపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు.

- మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలతో పూజలు జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.
- చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని పూలమాలలతో అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకున్నారు.
- మొండేటివీధిలోని షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో షిరిడిసాయి ఆలయం వద్ద వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

హరినామ సంకీర్తన



కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం హరినామ సంకీర్తనలు జరిగాయి. అంతకుముందు అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

స్వచ్ఛ క్యాంపస్



ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర పేరిట పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎచ్చెర్ల ఐటీఐలో చెత్తాచెదారాలు తొలగించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వీజీ రజిని స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రారంభించగా.. కేశరావుపేటలో ఇంకుడు గోతులను ఆర్డీవో సాయిప్రత్యూష పరిశీలించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

హోం కంపోస్టుపై అవగాహన



ప్రజలు హోంకంపోస్టుపై అవగాహన పెంచుకోవాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు అన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా గార, శ్రీకూర్మంలో పరిసరాలు శుభ్రం చేశారు. ఈవోపీఆర్‌డీ కూర్మారావు, సెక్రటరీ ఈశ్వరమ్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

– గార

పరిసరాల పరిశుభ్రత ప్రధానం



శ్రీకాకుళం న్యూకాలనీ: ఆర్ట్స్ కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్, ప్రిన్సిపాల్



శ్రీకాకుళం అర్బన్: కేంద్ర గ్రంథాలయం ఆవరణను శుభ్రం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని వక్తలు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా (అటానమస్) డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలల్లో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో, పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర సురేఖ ఆధ్వర్యంలో చెత్తా చెదారాలు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు విద్యార్థులతో స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, గ్రంథాలయ సిబ్బంది కె.ప్రత్యూష, పి.వరలక్ష్మి, యు.కళ్యాణి, పి.రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం న్యూకాలనీ: మహిళా కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యచంద్ర, తదితరులు

పోగొట్టుకున్న బ్యాగు తిరిగొచ్చింది

- ఆభరణలతో ఉన్న బ్యాగును ఆటోలో మర్చిపోయిన ప్రయాణికుడు
- గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు



ఆభరణాలున్న బ్యాగును బాధితునికి అప్పగిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం నుంచి వచ్చిన ఓ వ్యక్తి తన బంగారు ఆభరణాల బ్యాగును ఆటోలో మర్చిపోయాడు. వెంటనే రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా గంటల వ్యవధిలోనే ఆటోను ట్రేస్ చేసి పోలీసులు పట్టుకున్నారు. శనివారం జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. విశాఖకు చెందిన నిమ్మన మురళీకృష్ణ శనివారం జిల్లా కేంద్రానికి వ్యక్తిగత పనిపై వచ్చారు. ఆర్టీసీ కాంప్లెక్సులో బస్సు దిగి ఆటోలో పీఎస్ఎన్ఎం స్కూల్ వరకు ప్రయాణించారు. ఈ క్రమంలో వెంట తెచ్చుకున్న బ్యాగును ఆటోలో మరిచిపోయి దిగిపోయారు. ఇంతలోనే ఆటో వెళ్లిపోయింది. బ్యాగు మర్చిపోయానని గుర్తుకు రావడంతో రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావును ఆశ్రయించారు. తక్షణమే ఆయన పోలీస్‌కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించి ఆటో వెళ్లే మార్గాన్ని, రిజిస్టర్ నెంబర్‌ను తెలుసుకున్నారు. రామలక్ష్మణ కూడలి, పీఎస్ఎన్ఎం స్కూల్ వద్ద ఆటో స్టాండ్‌లలో వాకబు చేశారు. అక్కడివారు చెప్పిన రిజిస్టర్ నంబర్ మ్యాచ్ అవ్వడంతో చిరునామా తెలుసుకుని ఫోన్ నెంబరును గుర్తించారు. వెంటనే ఫోన్ చేసి ఆటోలో బ్యాగు ఉందని చెప్పి వెంటనే రమ్మనడంతో అప్పటికే ఆమదాలవలసలో ఉన్న ఆటోవాలా స్టేషన్‌కు వచ్చి బాధితునికి బ్యాగు అప్పగించాడు. బాధితుడు ఫిర్యాదిచ్చేముందు తమకు బ్యాగు పోయిందనే విషయమే చెప్పారని, అందులో బంగారం ఉన్నట్లు చెప్పలేదని, బాగా ఆరాతీస్తే చెప్పారని.. ఈ విషయం ఆటోవాలాకు తాము చెప్పలేదని సీఐ పేర్కొన్నారు. ఏదేమైనా రెండు గంటల వ్యవధిలో బ్యాగును బాధితునికి అప్పగించడం పట్ల ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సీఐ ఈశ్వరరావును, సిబ్బందిని అభినందించారు.